క్లుప్తంగా

నిర్ణీత గడువులోపు సమస్యల పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే ప్రజా ఫిర్యాదులను నిర్ణీత గడువులోపు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. స్థానిక నగరపాలక కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి కమిషనర్ వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

ముఖ్య కూడళ్లలో మెడికల్ క్యాంపులు

కర్నూలు(సెంట్రల్): వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా ముఖ్య కూడళ్లలో మెడికల్ క్యాంపులు, 108, అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వినాయకఘాట్, పూలబజార్, పెద్దమార్కెట్, లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మండపం, చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా, రాజ్‌విహార్, ఆర్ఎస్ రోడ్డు, బిర్లాగేట్, కలెక్టరేట్ దగ్గర మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు.

రేపు విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన

కర్నూలు(సెంట్రల్): పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ ఈనెల 27న వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సీపీఎం జిల్లా నాయకుల టి.రాముడు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాగన్న, సీపీఐ ఎంఎల్ జనశక్తి ఎస్‌యూసీఐ నాయకులు సుంకన్న తెలిపారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

సీపీఎస్‌నే అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాల ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ కె. ప్రకాష్‌రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఫ్యాప్టో, ఏపీసీపీఎస్ఈఏ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం తెస్తున్న నూతన పెన్షన్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. జీపీఎస్‌తో ఉద్యోగులకు ఎలాంటి లాభం లేదన్నారు .కార్యక్రమంలో ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు జి. హృదయరాజు, జిల్లా చైర్మన్ ఎస్.గోకారి,ఏపీసీపీఎస్ఈఏ గౌరవాధ్యక్షుడు లింగారెడ్డి, జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

అరుతడి పంటలనే సాగు చేయాలి

కర్నూలు(సెంట్రల్) : జిల్లాలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అన్నదాతలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ..ఈ సంవత్సరం వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో రైతాంగం పప్పుశనగ, జొన్నలు, కొర్రలు తదితర ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 67,094 క్వింటాళ్ల పప్పు శనగ విత్తనాలను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచిందన్నారు.

కలెక్టర్‌ను కలసిన ఎన్ఐసీడీసీ సభ్యులు

కర్నూలు (టౌన్) : జాతీయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ అధికారులు సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనను కలిశారు. పరిశ్రమల స్థాపన, అభివృద్ధి అంశాలపై కలెక్టర్‌తో వారు చర్చించారు. అలాగే ఓర్వకల్లులో ఏపీ ఐఐసీ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. అక్కడ చేపట్టాల్సిన పనులతో పాటు హైదరాబాద్-బెంగుళూరు మీదుగా చేపట్టాల్సిన పరిశ్రమలపై చర్చించారు. కలెక్టర్‌ను కలసిన వారిలో ఎన్ఐసీడీసీ జీఎం రాజీవ్ శర్మ, ఎన్విరాన్మెంటల్ సీనియర్ మేనేజర్ నీరజ్ కుమార్, ఏపీఐఐసీకి చెందిన సభ్యులు ఉన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం

కర్నూలు (టౌన్) : ఈనెల 28 వ తేదీ నగరంలోని పలు కాలనీలకు మంచినీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బళ్లారి చౌరస్తా సమీపంలోని ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాల్ వద్ద 500 ఎంఎం డయా పైప్ లైన్ మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. దీనివల్ల నగరంలోని అబ్బాస్ నగర్, ఉద్యోగనగర్, శరీన్ నగర్, రాఘవేంద్ర నగర్, ముజఫర్ నగర్, పోలీసు కాలనీ, పంచరత్న కాలనీ, శివప్ప నగర్, నిర్మల్ నగర్, వాసవీనగర్ (వార్డులు 27, 29, 30, 31, 32,34,35)లకు నీటిసరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

మది మదిలో బొజ్జ గణపతి



సెంట్రల్ ప్లాజాలో కొలువుదీరిన గణనాథుడు

కర్నూలు కల్చరల్: వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నగరంలో ఎనిమిదో రోజు సోమవారం వినాయక ఆలయాలతో పాటు గణనాథుని మండపాల వద్ద భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు వినాయక మండపాల వద్ద నిర్వహించిన పూజల్లో పాల్గొని గణనాథుడిని దర్శించుకున్నారు. మండపాల వద్ద లక్ష్మీ, గణపతి హోమాలు, సామూహిక కుంకుమార్చనలు, భజనలు, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులకు, మహిళలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పలు మండపాల వద్ద అల్పాహార, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, కార్పొరేటర్లు పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. గణేష్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, కార్యాధ్యక్షులు సీవీ నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఉపాధ్యక్షులు హరీష్‌బాబు, జిల్లా సమన్వయకర్త డాక్టర్ నాగఫణి శాస్త్రి, తదితరులు వివిధ ప్రాంతాల్లోని వినాయక మండపాలను సందర్శించి పూజల్లో పాల్గొన్నారు.

నిమజ్జనం వేళ జాగ్రత్త..



ఎం.ఉమాపతి, కర్నూలు ఆపరేషన్స్, ఎస్ఈ

కర్నూలు (రాజ్‌విహార్): ఈనెల 18 న కొలువుదీరిన గణనాథుడిని నేడు నిమజ్జనం చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే ఊరేగింపులో ఏదైనా ప్రమాదాలు, అపశ్రుతులు జరిగితే బాధిత కుటుంబాలకు తీరని విషాదం మిగులుతుంది. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని అధికారుల సూచిస్తున్నారు. ముఖ్యంగా ఎత్తైన విగ్రహాలను తరలించే సమయంలో స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద వేలాడే విద్యుత్ తీగలు తాకితే షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. ఇలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు వెంటనే సెంట్రల్ బ్రేక్ డౌన్ సెల్‌కు ఫిర్యాదు చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి సూచించారు. సోమవారం ఆయన స్థానిక పవర్ హౌస్‌లో కింది స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. మంగళవారం వినాయక నిమజ్జనం సందర్భంగా విధులు వేసిన ప్రతి ఒక్క ఉద్యోగి తమకు కేటాయించిన స్థానాల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

నిర్దేశించిన సమయానికి రావాలి



స్థానిక ఉత్సవ సమితులు నిర్దేశించిన సమయానికి వినాయక విగ్రహాలతో ఊరేగింపుగా బయలు దేరాలి. విగ్రహాలను తరలించడానికి పోటీ పడకుండా క్రమపద్ధతిలో వస్తే ఇబ్బందులు ఉండవు. ఎలాంటి గొడవలకు తావివ్వకుండా సంప్రదాయ బద్ధంగా కార్యక్రమం చేపట్టాలి.

– సి.వి.నారాయణరెడ్డి, నగర కార్యాధ్యక్షులు, గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి

ప్రశాంతంగా జరుపుకుందాం



వినాయక నిమజ్జనాన్ని నాలుగు దశాబ్దాలకు పైగా ప్రశాంతంగా నిర్వహించుకుంటున్నాం. ఈ ఏడాది కూడా ఎలాంటి అలజడులకు తావులేకుండా వేడుకలు విజయవంతం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. ఊరేగింపులో ఎవరికీ అసౌకర్యం కలిగించవద్దు.

– కగ్గోలు హరీష్‌బాబు, ఉపాధ్యక్షులు, గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి

ఎన్ఎస్ఎస్‌తో సేవాభావం

కర్నూలు సిటీ: ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థుల్లో సేవా భావం పెరుగుతుందని సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్ అన్నారు. సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీలో సోమవారం ఎన్ఎస్ఎస్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి కాలేజీ ప్రిన్సిపాల్ కుమార్‌తో పాటు బనగానపల్లె ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ డా.బడెసాహెబ్, ఆల్ ఇండియా రేడియో డైరెక్టర్ మురళీ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ సేవకులతో ప్రతిజ్ఞ చేయించారు.

కేవీఆర్ కాలేజీలో

కేవీఆర్ మహిళ డిగ్రీ కాలేజీలో ఎన్ఎస్ఎస్ డేను పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాష ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజ సేవ కోసం ఎప్పుడు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఇందిరాశాంతి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు జయలక్ష్మి, డా.బాశెట్టి లత తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌యూలో మొక్క నాటుతున్న వీసీ ఆనందరావు

సేవే లక్ష్యంగా పని చేయాలి

కర్నూలు (న్యూసిటీ) : సమాజంలో మార్పు తీసుకురావాలంటే సేవే లక్ష్యంగా పని చేయాలని విద్యార్థులకు రాయలసీమ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు సూచించారు. ఎన్ఎస్ఎస్ డేను పురస్కరించుకుని సోమవారం వర్సిటీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రెక్టార్ సీవీ.కృష్ణారెడ్డి, రేడియోస్టేషన్ డైరెక్టర్ మురళీ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ జి.అరుణ పాల్గొన్నారు.

వైద్యచికిత్సలో ఫార్మాసిస్టులది కీలక పాత్ర

కర్నూలు(హాస్పిటల్): వైద్యచికిత్సలో ఫార్మాసిస్టులు సైతం కీలక పాత్ర పోషిస్తారని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చెప్పారు. ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైరైన ఫార్మాసి సూపర్‌వైజర్ కేవీ సుబ్రహ్మణ్యం, ఫార్మాసిస్టు హుసేన్ సాహెబ్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మెడికల్ స్టోర్ ఆఫీసర్ డాక్టర్ శారద, డాక్టర్ సునీల్ ప్రశాంత్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్, ఫార్మాసిస్టులు శర్మ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు సిటీ: మదర్ థెరిస్సా ఫార్మాసి కాలేజీలో సోమవారం ఘనంగా ఫార్మాసిస్ట్ డే వేడుకలు నిర్వహించారు. ఏ క్యాంపులోని కాలేజీ నుంచి గాయత్రి ఎస్టేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాలేజీలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా కర్నూలు మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ డా.సాయి సుధీర్ హాజరై ప్రసంగించారు. ఫార్మాసి రంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కాలేజీ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ ప్రస్తుతం ఫార్మాసిస్ట్ నిపుణుల కొరత ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జె.రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ కె.సురేష్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

హాస్టళ్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లోని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం ఆయన జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి పి. వెంకటలక్షుమ్మతో కలిసి స్థానిక బీ క్యాంప్‌లోని బీసీ, ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆయా వసతి గృహాల్లోని రికార్డులను పరిశీలించారు. ఈ నేపథ్యంలోనే ఆయన హాస్టళ్లలోని సౌకర్యాలు, ఆహార నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించారు. అలాగే హాస్టళ్లలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్దేందుకు చర్యలు చేపడతామన్నారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి వర్గాల నుంచి వచ్చిన విద్యార్థినులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారిణి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్‌విద్యార్థినులతో మాట్లాడుతున్న వెంకట నాగ శ్రీనివాసరావు

విస్తృతంగా ఆరోగ్య సురక్ష సర్వే

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే విస్తృతంగా కొనసాగుతోందని మాస్ మీడియా అధికారిణి ప్రమీలాదేవి చెప్పారు. సోమవారం ఆమె ముజఫర్ యూపీహెచ్‌సీ పరిధిలోని మహాత్మానగర్, పోలీస్ కాలనీ భగవాన్‌నగర్‌లలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజల ఆరోగ్యానికి భరోసా ఏర్పడుతుందని చెప్పారు. ఇందులో భాగంగా మొదట వలంటీర్లు ఇంటింటి సర్వే చేసి డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్యక్రమం గురించి కరపత్రం పంపిణీ చేసి అవగాహన కల్పిస్తారన్నారు. ప్రస్తుతం ఏఎన్ఎం, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఇంటింటికి తిరిగి అవసరమైన వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాలను జేఏఎస్ యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యసేవలు అవసరమైన వారికి జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్ ఇచ్చి అక్టోబర్ 7న ముజఫర్ నగర్ యూపీహెచ్‌సీలో ఇద్దరు ఎంబీబీఎస్, ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లచే నిర్వహించే వైద్యశిబిరానికి తరలించి తగిన చికిత్సలు, ఉచితంగా మందులు పంపిణీ చేసి అనంతరం మెరుగైన ఆరోగ్యసేవలు అవసరమైన వారిని డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

నోటీస్ బోర్డు

27న పారామెడికల్ కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్):కర్నూలు వైద్య కళాశాలలో డిప్లమా ఇన్ పారామెడికల్ కోర్సులకు ఆఖరి కౌన్సెలింగ్ ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పి. సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కళాశాలలోని న్యూ ఆడిటోరియంలో కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందన్నారు. అభ్యర్థులు వారి విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు హాజరుకావాలని సూచించారు. మిగిలిపోయిన డిప్లమా ఇన్ పారామెడికల్ సీట్లకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం భర్తీ చేస్తామన్నారు.

ఈ రోజు

రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీలు

కర్నూలు కల్చరల్: శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం నుంచి రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు మాకా అశోక్‌కుమార్ తెలిపారు. 26 నుంచి 27వ తేదీ వరకు మూడు రోజుల పాటు పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. 'మానవత్వమును పెంపొందించు విద్యావశ్యకత ' అనే అంశంపై డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్ విద్యార్థులకు, 'ప్రకృతియే ఉత్తమ గురువు' అనే అంశంపై ఇంటర్, పాలిటెక్నిక్ విద్యార్థులకు, 'ఆచార్య దేవో భవ' అనే అంశంపై 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పోటీలు ఉంటాయని తెలిపారు.

అత్యవసర సమయాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): వినాయక నిమజ్జనం సందర్భంగా మంగళవారం అత్యవసర పరిస్థితులు ఏర్పడే చోట విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ఎత్తైన విగ్రహాలు తరలించే చోట, విద్యుత్ తీగలకు విగ్రహాలు తాకే అవకాశం ఉన్న చోట అప్పటికప్పుడు సరఫరా నిలిపివేసి తర్వాత మళ్లీ పునరుద్ధరిస్తామని ఆయన వెల్లడించారు.

క్రైం కార్నర్

నీటిసంపులో పడి బాలుడి మృతి



మణికంఠ

కర్నూలు : కల్లూరు మండలం శరీన్‌నగర్‌లో నివాసముంటున్న రాఘవేంద్ర, మంజుల దంపతుల కుమారుడు మణికంఠ (5) ఇంటి పక్కనున్న నీటిసంపులో పడి మృతిచెందాడు. బాలుడు అంగన్‌వాడీ బడిలో 1వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం నుంచి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు సమీపంలోని గణేష్ మండపం దగ్గర ఉంటాడులే అని భావించి నిర్లక్ష్యం చేశారు. రాత్రి పొద్దుపోయే దాకా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మణికంఠ తండ్రి రాఘవేంద్ర ఆటో తోలుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బాలుడి కోసం కాలనీ మొత్తం గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం మధ్యాహ్నం సమీపంలోని కాలువలు, నీటితొట్లలో పరిశీలించగా సంపులో శవమై కనిపించడంతో రాఘవేంద్ర కుటుంబం శోక సంద్రంలో మునిగింది. రాఘవేంద్రకు ముగ్గురు కూతుర్లు ఉండగా చివరివాడు మణికంఠ.

ఫీజులు వెనక్కి ఇవ్వాలి



క్లస్టర్ యూనివర్సిటీ వీసీ సాయిగోపాలను చుట్టుముట్టిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థుల నుంచి ముందుగానే వసూలు చేసిన ఫీజులు వెనక్కి తిరిగి చెల్లించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ నాయకులు సోమవారం వర్సిటీ ఎదుట ధర్నా నిర్వహించారు. అధికారులు స్పందించక పోవడంతో వీసీ చాంబర్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.సోమన్న, ఎస్.సాబీర్ బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ యూనివర్సిటీలో కూడా లేని విధంగా కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ అధికారులు కొత్త నిబంధనలు తీసుకొచ్చి విద్యార్థుల నుంచి కోర్సు ఫీజులు వసూలు చేశారన్నారు. జగనన్న విద్యా దీవెన పథకం కింద ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుందన్నారు. రిజిస్టర్ డిప్యూటేషన్‌ను ప్రభుత్వం రద్దు చేసినా ఎందుకు రిలీవ్ చేయడం లేదని వారు వీసీని ప్రశ్నించారు.

స్పోర్ట్స్

అండర్-19 క్రీడా పోటీలు ప్రారంభం

కర్నూలు (టౌన్) : నగరంలోని స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 విభాగంలో యోగా, కబడ్డీ, అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి జమీర్ బాషా ప్రారంభించారు. కార్యక్రమంలో అండర్-19 నిర్వాహక కార్యదర్శి పద్మావతి పాల్గొన్నారు.

28 న సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలు

కర్నూలు (టౌన్) : ఈనెల 28 వ తేదీ స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి అంతర్ పాఠశాలల సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులతో పాటు వ్యక్తిగత క్రీడా ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతున్నట్లు తెలిపారు. 2007 సంవత్సరం తరువాత పుట్టిన వారు ఈ పోటీలకు అర్హులని, వివరాలకు 9959051050 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

కర్నూలు (టౌన్) : విద్యార్థి దశలో చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కర్నూలు మండల విద్యాశాఖ అధికారిణి విజయకుమారి అన్నారు. సోమవారం ఎస్టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో అండర్-14, అండర్-17 విభాగంలో బాలబాలికలకు హాకీ పోటీలు, అలాగే స్థానిక బి.క్యాంప్ పాఠశాల క్రీడా మైదానంలో హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఆమె ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లక్ష్మయ్య, వ్యాయామ సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంక్షేమంలో క్రీడా ఆణిముత్యాలు



క్రీడాకారిణులతో సంక్షేమాధికారిణి

కర్నూలు(అర్బన్): ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు గుంటూరులో జరిగిన 36వ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల నెంబర్:2 వసతి గృహానికి చెందిన విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పతకాలు సాధించినట్లు వసతి గృహ సంక్షేమాధికారిణి కె. శిరీష తెలిపారు. హై జంప్‌లో కె. మైత్రీ రెండవ స్థానంలో నిలవగా, హెప్టాథ్లాన్‌లో పి. సుకన్య 3వ స్థానంలో నిలిచారన్నారు. అలాగే హార్డిల్స్‌లో వై. దానమ్మ రన్నర్‌గా నిలిచి జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చారని ఆమె సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని జి. హేమలత కబడ్డీలో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికయ్యారన్నారు. విజేతలుగా నిలిచిన హాస్టల్ విద్యార్థినులను సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె. రంగలక్ష్మీదేవి, సహాయ సంక్షేమాధికారి బి. మద్దిలేటి అభినందించారు.

జిల్లా చెస్ విజేత ఢిల్లీ పబ్లిక్ స్కూల్

కర్నూలు (టౌన్) : జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న స్థానిక భాష్యం స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన చెస్ పోటీల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ఉద్ధవ్ అండర్-14 విభాగంలో పాల్గొని జిల్లా విజేతగా నిలిచాడు. సోమవారం విద్యార్థిని పాఠశాలలో ప్రిన్సిపాల్ జస్మిత్ వికాస్ అభినందించారు.

సంక్షిప్తం

క్లాప్ డ్రైవర్లను ఆదుకోవాలి

కర్నూలు(సెంట్రల్) : కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న చెత్త సేకరణ వాహనాల డ్రైవర్ల(క్లాప్)ను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.నిర్మల కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట క్లాప్ డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ఆ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మారేళ్ల రామాంజనేయులు, సాయిబాబా, అబ్దుల్‌దేశాయ్, నరసింహులు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని 35వ వార్డు మాదిరాజు నగర్‌లో ఏ గోవిందు అనే వ్యక్తి ఇంటిపై నిర్మాణంలో ఉన్న సెల్ టవర్ పనులను వెంటనే నిలిపివేయాలని ప్రజా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు సుధాకరప్ప మాట్లాడుతూ.. జనం నివాసం ఉంటున్న ప్రాంతాల్లో సెల్ టవర్లను నిర్మించడంతో రేడియేషన్ ద్వారా అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బంది పడే పరిస్థితి ఉందన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఎల్లప్ప ఆశయాలు కొనసాగిస్తాం

కర్నూలు(సెంట్రల్) : ఆటో యూనియన్ సీనియర్ ఎల్లప్ప ఆశయాలు కొనసాగిస్తామని సీఐటీయూ న్యూసిటీ అధ్యక్షుడు నరసింహులు, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, ఆ సంఘం న్యూసిటీ ప్రధాన కార్యదర్శి బి.రాధాకృష్ణ పేర్కొన్నారు. సోమవారం కార్మిక, కర్షక భవన్‌లో ఎల్లప్ప సంస్మరణ సభ జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): దళితుల సమస్యలు పరిస్కరించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగులరమేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. జగనన్న బడుగు వికాసం కింద మంజూరైన పెండింగ్ సబ్సిడీలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కర్నూలు(సెంట్రల్) : ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా రైతు సంఘం ఆధ్వర్యంలో కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపినట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వం స్పందించి వెంటనే జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కర్నూలు(సెంట్రల్) : మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే.నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్రం సంఘం పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు.

ఎంఐఎం పార్టీ గుర్తింపు రద్దు చేయాలి

కర్నూలు కల్చరల్: ఎంఐఎం పార్టీ గుర్తింపు రద్దు చేయాలని బీజేపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు కనిగిరి నీలకంఠ అన్నారు. సోమవారం స్థానిక భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

రెండురోజుల పాటు మేరీ మట్టి-మేరీ దేశ్

కర్నూలు సిటీ: ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంలో రెండు రోజుల పాటు అన్ని పాఠశాలల యాజమాన్యాలు మట్టి సేకరణ కార్యక్రమాలు చేపట్టాలని డీఈఓ డా.వి రంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి స్కూల్ పరిధిలో ఊరేగింపు సందర్భంగా మేరీ మట్టి-మేరీ దేశ్ బ్యానర్ ప్రదర్శించాలన్నారు. అలాగే విద్యార్థులకు ఈ కార్యక్రమంలో వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. ఈ నెల 30వ తేదీలోపు కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు.

రోడ్డు నిర్మాణాలు వేగవంతం చేయండి

కర్నూలు (న్యూసిటీ) : న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) ఆధ్వర్యంలో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఎన్‌డీబీ కాంట్రాక్టర్లను ఎస్ఈ నాగరాజు ఆదేశించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఈ సురేష్ బాబు, డీఈ విజయ భారతి, ఆదోని డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ మదనగోపాల్, ఎన్‌డీబీ కాంట్రాక్టర్ అశోక్, రుక్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పీజీ పరీక్షలు

కర్నూలు (న్యూసిటీ) : రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని ఆరు కేంద్రాల్లో పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో జరుగుతున్న ఈ పరీక్షలకు 62 మందికి గాను 59 మంది విద్యార్థులు హాజరయ్యారని సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

రైతు నేస్తం

శనగ సాగును ప్రోత్సహించండి

కర్నూలు(అగ్రికల్చర్): రబీ సీజన్‌లో 100 శాతం ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో శనగ సాగును ప్రోత్సహించాలని ప్రకృతి వ్యవసాయం రీజినల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ చక్రాల చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం మదూరునగర్‌లోని ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎలాంటి కెమికల్స్ లేకుండా పండించిన శనగలను తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డు ప్రసాదానికి సేకరించనుందని తెలిపారు. ఎప్పుడూ ఒకేపంటను సాగు చేయరాదని, ప్రధాన పంటతో పాటు పలు అంతరపంటలను కూడా సాగు చేయాలని పేర్కొన్నారు. కెమికల్స్ లేకుండా పండించిన పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్.చంద్రశేఖర్, కన్సల్టెంటు రాజేశ్వర్, డీపీఎంయూ సిబ్బంది పాల్గొన్నారు.